క్లుప్తంగా

దాచేపల్లి ఎంపీడీఓగా శోభారాణి



దాచేపల్లి : అభివృద్ధి పథంలో మండలాన్ని తీసుకెళ్తామని ఎంపీడీఓ ముప్పనేని శోభారాణి అన్నారు. దాచేపల్లి ఎంపీడీఓగా గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శోభారాణి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా సమర్థవంతంగా పనిచేస్తానని, మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శోభారాణిని ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సూపర్‌నెండెంట్ సాంబశివరావు, ఈఓపీఆర్డీ నాగెండ్ల రత్నం, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన మహాలక్ష్మి



రెంటచింతల: రెంటచింతల నూతన మండల ప్రజా పరిషత్ (ఎంపీడీఓ)గా యల్లా మహాలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. మహాలక్ష్మి ఇప్పటి వరకు దాచేపల్లి మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన షేక్ గౌసియాబేగం బదిలీపై బొల్లాపల్లి వెళ్ళారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు, మంచినీటి సౌకర్యం కల్పించడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై స్థానిక అధికారులు అలసత్వంగా ఉండవద్దన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఈఓపీఆర్డీ రామచంద్రరావు, రెంటచింతల గ్రామపంచాయతీ కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పూలమాలలు, దుశ్శాలువలతో ఎంపీడీఓను ఘనంగా సన్మానించారు.

పెళ్లి కానుక అందజేత



దాచేపల్లి : మండలంలోని పొందుగల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురంలో నూతన వధువుకు పెళ్లి కానుకను చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. కామిశెట్టి అప్పారావు కుమార్తె అశ్విని వివాహం నేపథ్యంలో ట్రస్ట్ ద్వారా బంగారపు తాళిబొట్టు, పట్టుచీరె, సారెను అందించారు.

సాంకేతిక సమస్యను పరిష్కరిస్తాం

దాచేపల్లి : ఆన్‌లైన్‌లో తలెత్తిన సాంకేతికపరమైన సమస్య ద్వారా చోటు చేసుకున్న తప్పిదాలను సరిదిద్దుతామని తహసీల్దార్ తానంగి ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని తంగెడ గ్రామంలో ఒకే వ్యక్తిపై 500 ఎకరాల భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించారని ఓ దినపత్రిక(సాక్షికాదు) కథనం వచ్చిందని, దీనిపై గత 20 రోజుల క్రితమే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. 9999 న్యూషనల్ ఖాతాలో ఇతరులతో ఉన్న ప్రభుత్వ భూమి వివరాలు సాంకేతిక పరమైన సమస్యతో ఒక వ్యక్తి పేరుపై నమోదు అయ్యిందని, ఈ సమస్యను తాము గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. తాము ఎవరి పేరు మీద ఎటువంటి ప్రభుత్వ భూములు ఆన్‌లైన్ చేయలేదని, కేవలం సాంకేతికపరమైన సమస్యతోనే తంగెడలో ఈ ఘటన జరిగిందని ఆయన తెలిపారు. రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నాలుగు రోజుల వ్యవధిలోనే సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ చెప్పారు.

డీఎల్‌డీఓ కార్యాలయం ప్రారంభం

గురజాల : డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో గల పంచాయతీ రాజ్ డిఈ గెస్ట్‌హౌస్‌లో డీఎల్‌డీఓ కార్యాలయం ప్రారంభించడం జరిగిందని డీఎల్‌డీఓ గబ్రూనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజనల్ పరిధిలోని సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వాలీబాల్ విన్నర్ పిడుగురాళ్ల టీమ్

పిడుగురాళ్ల: ఆటలు యువతకు స్ఫూర్తి దాయకంగా ఉంటాయని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మనెనం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాసుకోసం ఎస్సీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలిబాల్ పోటీల్లో చెన్నై టీమ్, పిడుగురాళ్ల టీమ్‌లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లో పిడుగురాళ్ల టీమ్ గెలుపొందింది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఫైనల్ మ్యాచ్‌కి హాజరై వాలిబాల్ ఆటను తిలకించారు. ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరగడంతో వాలిబాల్ పోటీలు నిర్వహించే ప్రాంగణమంతా ఈలలు, చప్పట్లతో హోరెత్తింది. గట్టి పోటీ మధ్య చివరకు చెన్నై టీమ్‌పై పిడుగురాళ్ల విజయం సాధించింది. మొదటి బహుమతిగా పిడుగురాళ్ల టీమ్‌కు రూ. 75 వేలు, షీల్డ్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. రన్నర్‌గా మిగిలిన చెన్నై అబ్బాస్ టీమ్ రూ. 50 వేల, షీల్డ్‌ను అందించారు. మూడవ బహుమతి హైదరాబాద్ టీమ్‌కు రూ. 30 వేల నగదు, షీల్డ్‌ను, నాల్గొవ బహుమతి బాపట్ల టీమ్ కైవసం చేసుకుంది. వీరికి రూ. 20 వేల నగదుతోపాటు షీల్డ్‌ను అందజేశారు. షీల్డ్‌ను మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి బహూకరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆటలు యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. అలాగే గెలుపు, ఓటమిలను స్వాగతిస్తూ ప్రతి ఒక్క ఆటగాడు స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. పిడుగురాళ్ల పట్టణంలో వాలిబాల్ పోటీలు నిర్వహించడంతో ఒక క్రీడా వాతావరణం అద్భుతంగా కనిపించిందన్నారు. భవిష్యత్‌లో కూడా క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడాకారులకు అండగా ఉంటామని ఈసందర్భంగా తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి మున్సిపల్ వైస్ చైర్మన్‌కొమ్ము ముక్కంటి, వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ కన్వీనర్ మందాసుధీర్‌ల ఆధ్వర్యంలో దుశాలువాలతో ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుంటున్న పిడుగురాళ్ల టీమ్

వై నాట్ 175 నాకౌట్ క్రికెట్ విజేత జీబీఆర్ టీమ్

పిడుగురాళ్ల: రాష్ట్రస్థాయి వైనాట్ 175 నాకౌట్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో నర్సరావుపేటకు చెందిన జీబీఆర్ క్రికెట్ టీమ్ మొదటి బహుమతి సాధించింది. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో కాసు కోసం లోకల్ యూత్ ఆధ్వర్యంలో 'వైనాట్ 175' జగనన్న నాకౌట్ క్రికెట్ ట్రోఫీ గురువారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న నర్సరావుపేటకు చెందిన జీబీఆర్ టీమ్ బ్యాటింగ్ నిర్వహించి నిర్ణీత 20 ఓవర్లల్లో 175 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరుకు చెందిన పోలీస్ వారియర్స్ 15 ఓవర్లల్లో 88 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. దీంతో జీబీఆర్ హాస్పటల్ మొదటి బహుమతిని కైవసం చేసుకోగా, పోలీస్ వారియర్స్ రెండవ బహుమతిని కైవసం చేసుకుంది. మూడవ స్థానం దాచేపల్లికి చెందిన మారుతీ లెవెన్ టీమ్ కైవసం చేసుకుంది. మొదటి బహుమతి జీబీఆర్ టీమ్‌కు రూ. 1,75,175 నగదు బహుమతిని కాసు కోసం లోక్ యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అందించారు. అలాగే రెండవ బహుమతి గుంటూరు పోలీస్ వారియర్స్‌కు రూ. 1,00,175 నగదు బహుమతిని పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అందజేశారు. మూడవ బహుమతి దాచేపల్లికి చెందిన మారుతీ లెవన్ టీమ్‌కు రూ. 60,175 నగదు బహుమతిని డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు, పాశం వెంకటేశ్వరరెడ్డి(చిన్నోడు)లు నగదు బహుమతిని అందజేశారు. అలాగే షీల్డ్‌లను మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి బహూకరించారు. మ్యాన్ ఆఫ్‌దా సీరీస్‌ను రూ. 15,175 నగదును నూనె యాకోబు, బెస్ట్ బోలర్ రూ. 10,175 నగదును బుల్లెట్ మణిచౌదరి, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ. 10,175 రెండవ వార్డు కౌన్సిలర్ కొక్కెర శ్రీనులు అందజేశారు. కార్యక్రమాన్ని కాసు కోస్ లోకల్ యూత్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్గనైజింగ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



నర్సరావుపేట జీబీఆర్ టీమ్‌కు షీల్డ్‌తోపాటు నగదును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడి నిర్మాణానికి శంకుస్థాపన



కారెంపూడి: శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన బంగారమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ జరిగింది. గ్రామానికి ఉత్తర దిక్కున ఉన్న తోటల్లో గుడి నిర్మాణానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శంకుస్థాపన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పలిశెట్టి కోటేశ్వరరావు (మునసబు), కిల్లా కాశి, శ్రీనివాసరావు, శేషగిరి, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయానికి తంగెడ వీఆర్వో సరెండర్

దాచేపల్లి : మండలంలోని తంగెడ గ్రామ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వై. ఏసుదానంను జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని గురువారం సరెండర్ చేశారు. తంగెడలో ఓ వ్యక్తి పేరుపై ప్రభుత్వ, పట్టా భూములు ఎక్కించారనే ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారుల ప్రాథమిక విచారణలో భాగంగా వీఆర్వో ఏసుదానంను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు వెల్లడించారు. ఈ అంశంపై విచారణ చేస్తున్నామని, సాంకేతికపరమైన సమస్యతో కాకుండా ఇతర కోణాల్లో భూములను ఆన్‌లైన్ చేసేందుకు ప్రయత్నిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ టి. ప్రవీణ్ కుమార్ చెప్పారు.

చెన్నకేశవుని చెంత పల్నాటి వీరుల ఆయుధాల ప్రతిష్ట

కారెంపూడి: ఏలూరు జిల్లా జ్యానంపేట, జనార్థనపురం గ్రామాలకు చెందిన వీరాచారవంతులు తమ కున్న పల్నాటి వీరాచారాన్ని ఆచార వ్యవహారాలను నెరవేర్చేందుకు గాను తమ వద్ద ఉన్న ఆయుధాలకు (దైవాలు) నూతనత్వం చేకూర్చిన సందర్భంగా వాటికి సంప్రదాయం ప్రకారం పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్‌చెన్నకేశవ చేతుల మీదగా గురువారం ప్రతిష్ట చేయించుకున్నారు. గత మూడు రోజులుగా పీఠాధితిపతి వివిధ రకాల క్రతువులు నిర్వహించి చెన్నకేశవస్వామి సన్నిధిలో ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా వీరాచారవంతులు ప్రతిష్ఠ చేసిన ఆయుధాలతో చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయాల్లో కత్తిసేవలు చేసుకున్నారు. ఆయుధాలను సంప్రదాయ డోలు సన్నాయి వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వీరాచారం అమలుచేయకపోతే తమకు ఎలాగో ఉంటుందని అందుకే ఎన్ని ఇబ్బందులున్నా ప్రతి ఏటా పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో జరిగే పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో క్రమం తప్పక పాల్గొని తమ వీరాచారాన్ని నెరవేర్చుకుని వెళ్తామని ఆచారవంతులు తెలిపారు. క్రమంలోనే తమ వద్ద ఉన్న ఆయుధాలు కొన్ని పాడైపోతే నూతన ఆయుధాలు చేయించుని వాటికి చెన్నకేశవుని చెంత ప్రతిష్ఠ చేయించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆయుధాలకు ప్రతిష్ఠ చేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

మాచర్ల రూరల్: కలియుగ దైవం శ్రీఅలివేలు మంగ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నరసింహస్వామి, రాజ్యలక్ష్మి, వీరాంజనేయ స్వామి, ద్వార పాలకుల విగ్రహ ప్రతిష్ఠతను భక్తి శ్రద్ధలతో వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించడం శుభపరిణామమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు అన్నారు. గురువారం బస్టాండ్ ఆవరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నరసింహస్వామి, రాజ్యలక్ష్మీదేవి, వీరాంజనేయ స్వామి, జయ విజయుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో ప్రత్యేక పూజ నిర్వహించి ఆయన మాట్లాడారు. కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిరూపాలైన నరసింహస్వామి విగ్రహాలను పట్టణ ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించడం, పట్టణ అభివృద్ధికి, శాంతి సౌభాగ్యాలకు నెలవుగా ఉంటుందని, స్వామి వారి ఆశీస్సులతో దేవాలయ కమిటీ, ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖాధికారులు వైభవంగా ఏర్పాటు చేయడం ఆనందకరమన్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో అర్చకులు పరుశురాం రామాంజనేయ చార్యులు, రామకృష్ణాచార్యులు, ఈఓ గిరిరాజు నరసింహబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, పోలా శ్రీను, చిల్లంచర్ల సత్యం, కొత్తమాసు బ్రహ్మారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్ కుటుంబ సభ్యులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం

విజయపురిసౌత్: స్థానిక శ్రీ సాయి ప్రేమ మందిరంలో శ్రీ షిరిడి సాయిబాబా వారి 29వ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ వేడుకలు ఆలయ ధర్మకర్త కుడుపూడి వీర వెంట సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు హనుమంత చార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం కాగడహారతి, మంగళస్నానం, మధ్యాహ్నం హారతి నిర్వహించారు. సీతా రామాంజనేయ భజన మండలి, శ్రీ పద్మావతి భజన మండలి, శ్రీ సత్యసాయి భజన మండలిల ఆధ్వర్యంలో సాయి నామం జపించారు. మధ్యాహ్నం 1500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగార్జునసాగర్ జెన్‌కో ఓఎండ్‌ఎమ్ సీఈ వి మంగేష్ కుమార్, ఓఎండ్‌ఎమ్ ఎస్ఈ రఘురామ్, ఎస్ఈ సివిల్ రామకృష్ణారెడ్డి, డీఈ వరప్రసాద్, ఇరిగేషన్ డీఈ వెంకట సుబ్బయ్య, లక్ష్మీదుర్గా, జానారెడ్డి, గౌంతిన సాయి, జీవీజీ కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

అనుమతులతోనే మండపం ఏర్పాటు

గురజాల : ఉన్నతాధికారుల ఆదేశాలు అనుమతులతోనే వినాయక విగ్రహానికి మండపం ఏర్పాటు చేయడం జరుగుతుందని దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గణపతి సురేష్ తెలిపారు. స్థానిక శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహంపై కోతులు, పక్షులు మలమూత్ర విసర్జన జరుపుతున్నాయనే కారణంతో విగ్రహానికి రక్షణ కోసం మండపం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దేవాదాయ శాఖ ఇంజినీర్ వారు పర్యవేక్షణ చేసిన తరువాతనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ వారి ఉత్తర్వుల మేరకు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. దేవస్థాన నిధులతో కట్టుబడి చేస్తే కమిటీ వారి తీర్మానం చేయాల్సివుందని భక్తుడు తన స్వతహాగా నిధులతో ఏర్పాటుచేస్తున్న దానికి కమిటీ వారి తీర్మానం అవసరం లేదన్నారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరుగు తిరునాళ్లను పురస్కరించుకుని జరుగు శిడిమాను ఊరేగింపుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. విగ్రహం ఏర్పాటు చేసిన దాత దేవండ్ల శ్రీనివాసరావు స్వతహాగా ముందుకు వచ్చి మండపం ఏర్పాటుకు ముందుకు రావడం జరిగిందన్నారు. ముందుగానే అందరి అనుమతులతోనే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి దేవస్థానం ప్రతిష్ట

దాచేపల్లి : మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామంలో శ్రీ గంగమ్మతల్లి దేవాలయం ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. గ్రామ పురోహితులు జానపాటి సీతారామశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ వాయిద్య సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. అనంతరం గంగమ్మతల్లి ఆలయంను ప్రతిష్ఠించి అందులో గంగమ్మతల్లి, పోతురాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇతర దేవత మూర్తుల విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రతిష్ఠ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమంను చేపట్టారు.

ఎమ్మెల్సీ జంగా పూజలు:

శ్రీ గంగమ్మతల్లి దేవస్థానం ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జంగాను సన్మానించారు. పూజలు చేసిన వారిలో వైస్ ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ జాన్ అహ్మద్, జంగా సురేష్, ఉపసర్పంచ్ అనుముల అంకిరెడ్డి తదితరులున్నారు.

వైరస్‌లను తట్టుకునే రకాలను సాగుచేసుకోవాలి

రెంటచింతల: పత్తి, మిరప పంటలను సాగుచేసే రైతులు పలు రకాల వైరస్ తెగుళ్లను తట్టుకునే రకాలకు చెందిన పంటలను సాగుచేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి, మిరప పంటల సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పత్తి పంటకు ఎక్కువగా గులాబిరంగు పురుగు తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు గులాబి రంగు పురుగు నివారణకు పిచికారి మందులను వాడుకోవాలన్నారు. ఇటీవల కాలంలో మిరప పంటకు సుమారు 82 రకాల వైరస్‌లు ఆశించి నష్టపరుస్తాయని మూడేళ్లుగా పలు జిల్లాలలో మిరపపంటకు ఈ తెగుళ్ల ఆశించడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మనరాష్ట్రంలో ఆకు ముడత, కుకుంబర్ మొజాయిక్ వైరస్, మొవ్వకుళ్లు వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ముందుగా పంటపొలంలో భూపరీక్షలు చేయించుకోవాలని, పంటమార్పిడి విధానాన్ని అనుసరించాలని, సేంద్రీయ ఎరువులను వాడి సమతుల్య ఎరువుల యాజమాన్యం పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల చెందిన మూడు, నాలుగు రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించడం వలన తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులను సాధించవచ్చునని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి

ఈదురుగాలులతో కూడిన వర్షం

గురజాల : పల్నాడు ప్రాంతంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గురజాలలోని ఒక వైపు ఎండ మరొక వైపు వర్షం కురిసిన విచిత్ర ఘటన చోటుచేసుకుంది. ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం 20 నిమిషాల పాటు కురిసింది. చెట్ల కొమ్మలు విరిగి కింద పడిపోయాయి. చిన్న చిన్న దుకాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

ప్రజలకు ఉపశమనం

గత కొద్ది రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న పల్నాడు ప్రాంత ప్రజలకు వర్షం రూపంలో కొంత మేరకు ఉపశమనం లభించింది. గురువారం సుమారుగా 20 నిమిషాలకు పైగా వర్షం కురిసింది. గత వారం రోజులుగా 45-47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు జరిగాయి. ఈ వర్షంతో కొంతమేరకు ఉపశమనం లభించిందని పలువురు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



గాలివానబీభత్సానికి ఇంటి పై కప్పు కిందకు పడిన దృశ్యం

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

గోలి(రెంటచింతల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయసాధన కోసం కృషి చేయాలని గోలి ఉప సర్పంచ్ దేవళ్ళ చంద్రకళను సూచించారు. గురువారం గోలి గ్రామ ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చంద్రకళను వైఎస్సార్ సీపీ రాష్ట యువజన ప్రధాన కార్యదర్శి, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అభినంధించి మాట్లాడారు. సీఎం జగన్ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించి పార్టీ అభివృద్ధికి కృషి చేసి గ్రామస్తుల మన్ననలను పొందాలన్నారు. అనంతరం పీవీఆర్‌ను ఉప సర్పంచ్ చంద్రకళ దుశ్యాలవలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ముందుగా ఎన్నికల ప్రత్యేక అధికారి ఈఓపీఆర్డీ రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నికకు మొత్తం 10 మంది వార్డు సభ్యులకు గాను 9 మంది హాజరు కాగ సర్పంచ్ మున్నా చంద్రోశేఖర్ దేవళ్ళ చంద్రకళను ప్రతిపాదించగా అందరూ చేతులెత్తి ఆమోదం తెలిపారు. సర్పంచ్ మున్నా చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్బారావు, మాజీ సర్పంచ్‌లు అల్లం రజనివాసు, తోడిచర్ల యోహాన్, పార్టీ నాయకులు త్రిపుర నాగేశ్వరరావు, పురంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



గోలి ఉప సర్పంచ్ దేవళ్ళ చంద్రకళను పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

బొమ్మ తుపాకీ చూపి చైన్ స్నాచింగ్‌కు యత్నం

కారెంపూడి: గుర్తు తెలియని వ్యక్తి బొమ్మ తుపాకీ చూపి మహిళ మెడలో నాంతాడు లాక్కోడానికి యత్నించిన ఘటన స్థానిక ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పాత బ్యాంకు సెంటర్‌లో బడ్డీ కొట్టు పెట్టుకుని జీవిస్తున్న బొజ్జ లక్ష్మి కొట్టు మూసేసి రాత్రి ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో దొంగ బొమ్మతుపాకీ చూపి మెడలో నాంతాడు అపహరించే యత్నం చేశాడు. ఈ ఘటనతో ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగు రావడంతో దొంగ పరారయ్యాడు. ఆ తర్వాత విషయం తెలుసుకున్న పోలీసులు దొంగ కోసం గాలించారు. అతని ఆచూకీ గుర్తించినట్లు తెలుస్తోంది.

నీటి సరఫరా సమస్యలపై తక్షణ చర్యలు

చిలకలూరిపేట: మంచినీటి సరఫరాకు సంబంధించి సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని సూచించారు. పట్టణంలోని రూత్ డైక్‌మెన్ కాలనీలో మంచినీటి సమస్యలను అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పైపులైన్ లీకులను గుర్తించి వెంటనే మరమ్మతు పనులు నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది మంచినీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకట రమణ, ఏఈఈ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పైపులైన్ ఏర్పాటు కారణంగా...

పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లోని గాంధీపార్కు రోడ్డులో తరచు లీకులు ఏర్పడుతున్న కారణంగా రూ.13 లక్షలతో కొత్త పైపులైన్ వేయడం జరుగుతుందన్నారు. దీని కారణంగా పట్టణంలోని తాషాబజారు, ఇస్లాంపేట, బాబుగారితోట, వడ్డెరపాలెం, రాగన్నపాలెం, గుండయ్యతోట, సుభానినగర్, పొన్నంవారివీధి, బిట్రా వారిబజారు, బొందిలిపాలెం ప్రాంతాల్లో ఈ నెల 12,13 తేదీలలో మంచినీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చైర్మన్ రఫాని తెలిపారు. ఈ నేపథ్యంలో 11వ తేదీ వరకు సంబంధిత ప్రాంతాల ప్రజలు మంచినీటిని అదనంగా పట్టుకొని నిల్వ చేసుకోవాలని సూచించారు.

వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం సీఎం జగన్‌తోనే సాధ్యం

జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి

మాచర్ల రూరల్: 70 సంవత్సరాల పల్నాటి ప్రజల కల అయిన వరికపూడిసెల నిర్మాణానికి పూర్తి అనుమతులు తెప్పించి, నిధులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు కృష్ణదేవరాయలకే దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డిలు అన్నారు. గురువారం మార్కెట్ యార్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా పల్నాటి ప్రజలు ఎదురు చూస్తున్న వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణం నుంచి పూర్తి అనుమతులు తీసుకొచ్చి రూ. 1274 కోట్లు బడ్జెట్‌లో ఆమోదం పొంది ప్రాజెక్టుకు శంకుస్థాపనకు సిద్ధమౌతున్న తరుణంలో కొంత మంది ఐక్య వేదిక పేరుతో విమర్శలు చేయడం తగదన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా శంకుస్థాపన చేసి పల్నాటి ప్రజలను మోసం చేశారని, దీని పై 2016లో ఎమ్మెల్యే పీఆర్కే అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు అనుమతులు లేవు అని సిగ్గులేకుండా సమాధానమిచ్చిన విషయాన్ని ప్రజలు మరచిపోరన్నారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ బతికి ఉంటే ఖచ్చితంగా ప్రాజెక్టు వచ్చి ఉండేదని, ఆయన ఆశయాన్ని పునికి పుచ్చుకున్న సీఎం జగన్ పూర్తి స్థాయి అనుమతులు, బడ్జెట్‌ను కేటాయించి పనులు ప్రారంభించి శంకుస్థాపన చేయనున్నారని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి